కథ

# చీర్ల చంద్రలేఖ

అరిగే రామారావు

ఆదివారం.

బయట మబ్బు మీద మబ్బుగా వుంది. ముసురు ముసురుగా వుంది. సెలవు మీద సెలవుగా వరసగా వచ్చిన సెలవులు. పెగ్ మీద పెగ్ వేసుకుని, రగ్గు మీద రగ్గు కప్పుకుని సుఖంగా, హాయిగా గడిపేయ గాలని రమాకాంతారావు గారు అంతా ప్లాన్ చేసుకున్నారు.

ఫుడ్‌గా ఎవడో గొట్టాంగాడిచ్చిన ఫారిన్ స్కాచ్ విస్కీ, ఫోన్ ఆర్డరు మీద హోం డెలీవరీ అయిః వేడి వేడి చిల్లీ చికెన్, సిగరెట్టు కేకులు, ప్లేటుల్లో జీడి పప్పులూ, చిప్సూ...

ఆయన 'స్వయం సేవ'లో ఫస్ట్ రౌండ్‌లో వున్నారు.



ఇంతలో కాలింగ్‌బెల్ మోగింది. ఆయన వులిక్కిపడ్డారు. కొంపదీసి పెళ్లాం గానీ రాలేదు కదా! ఈ దుకాణం చూసిందంటే, కొంప కాస్తా కొల్లే రయిపోతుంది.

బెల్ మోగుతూనే వుంది...

ఏదవుతే అదవుతుందని లేచి వెళ్లి తలుపు తీశారు. ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి బిత్తర పోయారు. పూలరథంలాగా గుమ్మటంగా, అందంగా వున్న ఒక ఆడమనిషి. "మేడం గారు లేరా?" అంటూ తను సమాధానం చెప్పే లోపలే చొరవగా లోపలికి వచ్చేసింది.

సూటుకేసు పట్టుకుని ఆమె కూడా ఒకడు లోపలికి వచ్చాడు. పెళ్లాం తరపు చుట్టాలేమో. ముప్పై ఏళ్ల కాపురంలో తనకు తెలియని చుట్టాలెవరున్నారు?

"మేడమ్ లేరు. వూరుకెళ్లింది" అన్నాడు.

ప్రక్కన వచ్చిన వాడు" అది తెలుసుకునే వచ్చాం" అని, మళ్లీ నాలిక్కర్చుకున్నాడు.

"ఓ౨- అందుకేనా ఇదంతా!" టీపాయ్ మీద సంతను చూస్తూ కొంటెగా నవ్వింది.

"ఇంతకీ మీరెవ్వరు?"

"మేడమ్ గారు కొత్త శారీస్ వస్తే తీసుకురమ్మ న్నారు!" అంది.

"ఓ చీర్లావిడ!"అని చప్పరించేశాడు.

"చీర్లావిడ అని మరీ అంత చీప్‌గా తీసేయ కండి సార్! చీర్ల చంద్రలేఖంటే మా అత్తకు మా కోస్తాల్లో పెద్ద పేరు" అన్నాడు వెంటవచ్చినోడు.

వీడ్ని ఎక్కడో చూసినట్లుందే అనుకున్నాడు.

"మేడం గారు లేకపోతే ఏమయిందండీ! మీరు న్నారుగా, మీరు చూడండి.చీరలు కట్టుకునేది ఆడ వాళ్ళమే అయినా చూసి మెచ్చుకోవాల్సింది మీ మగవాళ్లేగా!" వోరగా చూస్తూ అంది.

ఈ మాట సబబుగా వుంది.

మళ్లీ అంతలోనే "మేం చీరెలు కట్టుకునేది, విప్పుకునేది మీ కోసమేగా!" అంది. ఈ మాట మాత్రం తేడాగా వుంది.

ఆయన షాక్ తిన్నాడు. మనిషి చూస్తే సంసారపక్షంగా వుంది. మాట చూస్తే విపక్షంగా వుందే అనుకున్నాడు.

"అరేయ్ నూకా! చీరెలు బయటికి తీయరా. ఈ సార్‌కు చూపిద్దాం"

"ఏంటత్తా, నా పేరు నూకరాజయితే నూకా-నూకా అంటావు?" చిరుకోపంగా అన్నాడు.

వీడ్ని ఎక్కడ చూశానబ్బా! ఆయన సాలోచ నగా బుర్ర గోక్కున్నాడు.

నూకరాజు సూటకేసులోని చీరెలు బయటికి తీసి సోఫాలో పెడుతున్నాడు. మాటి మాటికి టీపాయ్ వంక చూస్తూ వూరికే పెదాలు తడుపుకుంటున్నాడు.

చీ. చంద్రలేఖ చంద్రవంక నవ్వినట్లు నవ్వుతూ, "మీరు తాగేది మధ్యలో ఆపేసినట్లున్నారు.అదేదో తీస్కోండి.ఆనక నన్ను తిట్టుకుంటారు" అంది.

"కావాలంటే మేమూ కంపెనీ ఇస్తాం" నూక రాజు నాలిక్కరుచుకున్నట్టు నటించాడు.

ఈ వెధవను ఎక్కడో చూశానే! ఆయన చూపు లన్నీ చీ.చం. మీదే వున్నాయి.

వాడి చూపులన్నీ టీపాయ్ మీదే వున్నాయి.

"ఒకే, ఒకే!" అంటూ ఆపేసిన రౌండ్ పూర్తి చేశారు.

చీర్ల చంద్రలేఖ బిజినెస్ ఫక్కీలోకి వెళ్లింది.

"నిజానికి మా లేడీస్ చాలామందికి ఏ చీర కట్టాలో తెలియదు. కొందరు ఎంత క్లాసు చీర్నయినా సాదాసీదాగా కట్టేస్తారు. దాన్తో ఆ చీరె అందం కాస్తా పోతుంది. చాలా కొద్దిమంది పొందిగ్గా, నాజూగ్గా కడుతారు. చీరె కట్టితే రొమాంటిక్‌గా వుండాలి. లోగుట్టులు తెలియాలి. బొడ్డుకెంత కిందగా కట్టాలి, కుచ్చిళ్లు ఎలా పోయాలి, పైట ఎంతబారు వదలాలి..ఇదంతా ఒక ఆర్ట్!"

ఆమె చెబుతున్న తీరు ముచ్చటగా వుంది.

"...చీరంచును గుండెల మీదుగా వాటంగా, లైట్‌గా సవరిస్తే అదెన్నో వూసులు చెబుతుంది, జారిన పైటల్లో మరెన్నో గుసగుసలు.."

"ఎస్సెస్!" అంటూ ఉత్సాహంగా వింటున్నాడు.

"అత్తా! ఈ మాటలన్నీ ఎందుకు? అదేదో సారుకు అర్థమయ్యేట్టు చూపించరాదూ? "

ఎప్పుడు పోసుకున్నాడో వాడి చేతిలో ఒక గ్లాసు వుంది.

"ఒస్సుంద్రా.. దొంగ సచ్చినోడా! సార్‌కి లేని తొందర నీకెంట్రా?" వోరగా చూస్తూ మత్తుగా కళ్లు వాల్చింది.

ఆయనకు హుషారు తన్నుకురాగా,"అవునవునూ, అదేదో మాకు చూపించవచ్చుగా!" నాటకఫక్కీలో అన్నాడు.

"అబ్బో! సార్ కూడా సరదాపడుతున్నారు. ఆ కాశ్మీరు సిల్కు ఇవ్వరా నూకా!"

"అబ్బో, స్టార్టింగే కాశ్మీరుతో మొదలెట్టావా! కాస్ మీర్ నుంచి క-న్యా-కు-మా-రి దాకా ఈ సార్‌ని తీసికెళ్ళు.." నాలిక మడత తడబడుతూ, మాట తడబడుతోంది.

వాడందించిన చీరె భుజాన వేసుకుని, "మీ బెడ్ రూమ్ ఎటుసార్?" అంది.

ఆయన చూపించారు. లోపలికెళ్లటానికి బెరుకు నటించింది. "ఫర్లేదు వెళ్ల..సారీ, వెళ్లండీ!"..వెళ్లింది.

అంతలోనే లోపల్నుంచి కేక. "మీ డ్రెస్సింగ్ మిర్రర్ ఎక్కడుంది సార్! కాస్త వచ్చి చూపించండి బాబూ!" గారంగా, శృంగారంగా అంది.

లోపలికెళ్లాడు. ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి బిత్తరపోయాడు.

తలను ఇటూ అటూ వూపి విదిలించి, మళ్లీ, మళ్లీ చూశాడు. అప్పటిదాకా వంటి మీదున్న చీరె బెడ్ మీద వుంది.

"ఓరి బాబోయ్!' కళ్లు తిప్పుకోలేకపోతున్నాడు.

"నిజానికి సిల్కు చీరె కట్టడం ఒక పట్టాన కుదిరి చావదు" బెస్త, చాపల వలను విసిరినట్లు శారీ అంచులు మొహానికి తాకేటట్లు గాలిలోకి విసిరింది.

కాశ్మీరుకు రాసిన ఆగ్రా అత్తరు గదంతా గుప్పుమంది.

"చెప్పానా, చూడండి! కుచ్చిళ్లు పోయటానికి నానాయాతన.. చేతిలోకి ఇమడవు. ఇమిడినా నడుం మీదనుంచి జారిపోతాయి. వూరికే కితకితలు.. పైట చెంగయితే సరేసరి! ఇలా వూరికే జారిపోతూ నానా తిప్పలు పెడ్తుంది.."

"గడసరి పడుచు చేతిలోంచి జారిపోయినట్టా?" మాట అందించాడు.

"అబ్బో, ఏంటో అనుకున్నా. మీరూ రసికులే!" ఆమె మెచ్చుకోలుకు జవాబుగా జోహారు చేశాడు.

"వూరికే అట్లా చూస్తూ నిలబడకపోతే, ఈ చీరెతో ఒకపక్క నేను తంటాలు పడ్తుంటే నాకు సాయం చేయకూడదా? "గోముగా, ముద్దుగా అంది.

చేతి సాయం చేస్తూ,"ఈ శారీకీ ఈ చోళీ అస్సలు నప్పలేదు నోనో..నేను నప్పనంటే నప్పను.. ఈ చోళీ మార్చాల్సిందే!" మాట ముద్దు ముద్దుగా వుంది.

"ఏంటో అనుకున్నా! మీకూ మాంఛి టేస్ట్ వుందే!" మళ్లీ జోహారు జవాబు..'చోళీకే పిచే క్యా హై..' కూనిరాగం!

"ఒరేయ్ నూకా! ఈ చీరె మీది మేచింగ్ బ్లౌజ్ తేరా, ఈ సార్‌కి చూపించాలి"

భుజం మీద వేసుకున్న రవికతో, రెండు చేతుల్లో రెండు గ్లాసుల్తో తూలుకుంటూ నూకరాజు లోపలికి వచ్చాడు. ఒక గ్లాసును ర.కాం. గాలికి, భుజాన్ని చీ.చం.కి అందించాడు. తలుపు దగ్గరికేసి వెళ్తూ వెళ్తూ "ఇనీజు అయిపోయాడే!" అని కిసుక్కున నవ్వాడు..

చీ(బా) రెడు పొద్దెక్కాక ర.కాం. గారు నిద్ర లేచారు. వళ్లంతా నలగబొడుస్తున్నట్లుంది.

టీ పెట్టుకుంటుంటే సెల్‌ఫోన్ మోగింది.

"హలో.." రాత్రంతా తన గుసగుసల్తో తనని కవ్వించిన చీర్ల చంద్రలేఖ గొంతు.

చీ.చం. "చీరెలు తీసికెళ్ళటానికి మా నూకరాజు గాడు వస్తున్నాడు. మీదెటూ కొనే బేరం కాదు" అంది.

"మరే బేరమంట?"

"వుత్త బేవర్సు బేరం!" కిలకిల నవ్వు.

ఆ మాటకే ఆయనకే బోలెడు హుషారు. అంతలోనే కాలింగ్‌బెల్ మోగింది. తలుపు దీసి చూస్తే ఈ నూకరాజుగాడు.

'వీడ్నెక్కడో చూసిట్లుందే!' ఎంత బుర్ర గోకున్నా అంతుబట్టడం లేదు. ఇక వుండబట్టలేక వాడ్నే అడిగాడు.

మొదట ఏదో బొంకాడు. ఆ తర్వాత గొంతులో మందుపడ్డాక నోరు విప్పాడు.

"..పోయిన ఎండాకాలంలో అమ్మగార్నీ మీ అమ్మాయిగార్నీ వెంటబెట్టుకొని, మీరు వైజాగ్ వచ్చారు కదండీ!"

"అవునవును"

రమాకాంతం గారు కీలకమైన ప్రభుత్వ శాఖలో కీలకమైన పోస్టులో వున్నారు. ఏ జిల్లాకైనా, ఏ నగరానికైనా ఎప్పుడైనావెళ్లి ఆకస్మిక తనిఖీలు చేయవచ్చు. తమ డిపార్టుమెంట్ జనాల్ని, కాంట్రా క్టర్లనూ చీల్చి చెండాడే అధికారాలున్నాయి. అందు చేత వాళ్లు ఈయనకు వంగి వంగి దండాలు పెడ తారు. అడుగులకు మడుగులొత్తుతారు. సర్వం సప్లై చేస్తారు. పోయినసారి సమ్మర్లో వైజాగ్ ఇన్‌స్పె క్షన్‌కెళ్లారు. వారి వెంట సతీమణి, మేరేజ్ డేట్ ఫిక్స యిన డాటరూ వున్నారు. పెళ్లికి కావాల్సిన చీరెలూ

గట్రా,నగ నట్రా షాపింగ్ చేస్తాం అన్నారు.

వారి వెంట ఉండి వారికి కావాల్సినవన్నీ కొనిపించే డ్యూటీ కాంట్రాక్టరు తాతబ్బాయి గారి నెత్తిన పడింది. షాపింగ్ చేయించటానికి నోట్ల కట్టల్తో తన మేనేజరు మంగరాజునూ, తన ఏ.సి. కార్తో వూరంతా తిప్పటానికి ఈ నూకరాజును పంపించారు.

"..వైజాగ్‌లో మీరున్న నాలుగు రోజులూ అమ్మగార్నీ, అమ్మాయి గార్నీ మా తాతబ్బాయి గారి ఏ.సి. కార్లో షాపింగ్‌కు చూసిన షాపు చూడకుండా, వెళ్లిన బజారు వెళ్లకుండా వూరంతా తిప్పింది ఈ నూకరాజుగారే కదండీ!"

"అవున్నోయ్!"

"అంతేనా, అమ్మగారికి తెలియకుండా సీక్రెటుగా మిమ్మల్నీ, మధురవాడ మంజువాణినీ భీమ్లీ గెస్ట్ హౌస్‌కు తీసికెళ్ళింది మనమే కదండీ!మీరు పీకల దాకా తాగి ఆ రాతిరి.. అప్పుడే మరిచిపోయారా?" వెకిలి నవ్వులు నవ్వాడు.

అదీ సంగతి అప్పుడు తన గట్టుమట్టులూ, వీక్ పాయింట్లూ పక్కన వుండి కనిపెట్టి వుంటాడు. అప్పుడు వంగి వంగి నమస్కారాలు పెట్టాడు. ఇప్పుడు తన ముందే కాలు మీద కాలేసుకుని సిట్టింగూ, కాలు వూపింగూ, డ్రింకింగూ,స్మోకింగూ. పైగా నిన్న ఆ స్కాచ్ మత్తులో వీడి దగ్గర తను జావగారిపోయాడు. అందుకే వీడు తన దగ్గర ఇట్టా గేమ్స్ ఆడుతున్నాడు.

"అవున్రా ఒరేయ్! నాకొకటి డౌట్‌గా వుందిరా! నీవెక్కడో విశాఖపట్నంవోడివి గదా, సిటీ ఎందుకొచ్చావ్?"

నవ్వుతూ, "ఓ అదా మీ డౌట్?మా అత్త ఎప్పట్నుంచో ఈ సిటీలో చీరెల షాపు పెట్టాలని ముచ్చటపడుతూంది. మీరెటూ వున్నారు గందా అని ఇటు పారొచ్చాం" అన్నాడు.

సీసా ఖాళీ చేసి, "మరి నేనిక వస్తా సార్! ఈ రాతిరి పుడ్డు, బెడ్డూత మా ఇంట్లోనే! మా అత్త చెప్పమంది. మా అత్త చీరెలు కట్టి చూపటమే కాదు! చేపల పులుసు వండడంలో కూడా బ్రహ్మాండం! నైటుకు రెడీగా వుండండి" అంటూ భుజం మీద ఆ సూటుకేసు పెట్టుకొని ఈల వేసుకుంటూ పోయాడు.

ఇంతా చేస్తే, తీరా చూస్తే చంద్రలేఖ ఇల్లు ఎక్కడో లేదు. ఈ హిల్స్‌లోనే రెండో రోడ్డు అవతల. ఆయన రోజూ వాకింగ్ వెళ్లే రూట్లోనే వుంది. తన రూట్లన్నీ ముందే తెలుసుకున్నట్లున్నారు.


..ఆ రాత్రి చేపల పులుసు అదిరింది. చేపల సట్టి ఖాళీ అయింది, పట్టె మంచం విరిగింది. విరిగినట్లు నటించింది. ఆయన బోర పెద్దదయింది. అట్లా మొదలైంది చీ.చం.తో ఆయన సావాసం.

ఊరు నుంచి వచ్చిన ఆయన సతీమణి, "ఏంటీ ఈ మనిషి తేడాగా వున్నాడే" అని ఆశ్చర్యపోతోంది.

తనతో టాకింగ్ తక్కువైంది. వాకింగ్ ఎక్కువైంది. 'కాలు మీద వెయ్యందే నిద్రపోని మనిషి, కాళ్ల పీకుతున్నాయని పక్కకి తిరిగి పడుకుంటున్నాడు. ఏంటీ చెపుమా' అని చెంపన చెయ్యి వేసుకుంటోంది.

జిల్లాలకు ర.కాం,గారి 'సుడిగాలి' తనిఖీల తాకిడి ఎక్కువైంది. వెంట చీ.చం. తోక ఈ నూకరాజుగాడు. ప్రతి తనిఖీకి ఫినిషింగ్ టచ్చింగ్‌గా చీ.చం. షాపింగూ! రకరకాల డిజైన్లు, మన్నిక రకాలను ఎన్నిక చేసుకుంటోంది. బిల్లులు తడిసి మోపెడవుతుంటే, వాటిని చెల్లించలేక జిల్లా పార్టీలు లబోదిబోమంటున్నారు.

ఏతావాతా రెండొకట్ల రోడ్డులో కొత్తగా చంద్రలేఖ చీరెల షాపు వెలిసింది.



## పొరపాటు అయిపోయింది...

**కొన్ని పొరపాట్లు ఎలాంటి ఆవేదనలకు గురిచేస్తాయో తెలియజేసే సంఘటన ఇది...**

దొంగ అనుకుని కన్న కొడుకునే కాల్చేశాడో తండ్రి. తెల్లారు జాము వేళ దాహం వేస్తే నీళ్ళు తాగడానికి లేచాడా కొడుకు. పద్దెనిమిదేళ్ళ కొడుకు కను చీకటిలో గదిలో నీళ్ళు తాగబోతోంటే అతని నీడను చూసి, దొంగనుకున్నాడు తండ్రి. అనుకున్నదే ఆలస్యం రివాల్వర్ గురిపెట్టి కాల్చేశాడు. కాలికి తగిలిన బులెట్ దెబ్బకు 'డాడీ' అని కొడుకు అరిస్తే ఆ గొంతు తన కొడుకుదని గుర్తించి పొరపాటు అయిపోయిందన్నట్టుగా 'బాబూ'అంటూ గగ్గోలు పెట్టాడు తండ్రి. కొడుకుని ఆస్పత్రిలో జాయిన్ చేసి చికిత్స చేయిస్తున్నాడు. పిల్లాడికి ప్రాణ భయం లేదుగాని, తండ్రి అంటే పిచ్చ కోపంగా ఉంది. ఈ సంఘటన ఇటీవలే మలేషియాలో జరిగింది.

**సీసా ఖాళీ చేసి, "మరి నేనిక వస్తా సార్! ఈ రాతిరి పుడ్డు, బెడ్డూ మా ఇంట్లోనే! మా అత్త చెప్పమంది. మా అత్త చీరెలు కట్టి చూపటమే కాదు! చేపల పులుసు వండడంలో కూడా బ్రహ్మాండం! నైటుకు రెడీగా వుండండి" అంటూ భుజం మీద ఆ సూటుకేసు పెట్టుకొని ఈల వేసుకుంటూ పోయాడు.**

'ఈ షాపులో అన్నీ చౌక' అని పేరు పడిపోయింది. కొన్న చీరలయితే కదా గిట్టుబాటు ధర చూసుకునేది. నోటికి వచ్చిందే ధర! చేతిలో పడిందే డబ్బు! చీరల చంద్రలేఖషాపు పేరు ఆ 'హిల్స్'లో మారుమోగిపోతోంది. ఆడామగా ఎగబడుతున్నారు. 'భలే చౌక బేరంలే!'అని ఆడవాళ్లు, 'భలే హుషారైన మనిషిలే' అని మగవాళ్లూ విరగబడుతున్నారు. తన మాటల్తో ఆడవాళ్లను వుబ్బియటూ, తన చిలిపి చూపుల్తో మగవాళ్లను గిలిగింతలు పెట్టాటాలు..జనం విరగబడకా, ఎగబడకా చస్తారా మరీ!

ర.కాం. గారి సతీమణీ కూడా చంద్రలేఖ కష్టమరైపోయింది. "ఎవరో చంద్రంలేఖ! ఎక్కడ్నుంచి తెస్తుందో ఏమో, ఎన్నెన్ని రకాలు, ఎన్నెన్ని డిజైన్లూ పైగా ఎంత చౌకా! ఫ్యాక్టరీ అవుట్‌లెట్ అంట" భర్తతో అబ్బురంగా చెప్తుతూంది.

'ఎరక్కపోయి దీని అవుట్‌లెట్‌లో ఇరుక్కుపోయా! నన్ను కట్‌లెట్‌లాగా నంజుకుతింటోంది" ఆయన పైకి అనలేక లోలోపల కుళ్లిపోతున్నాడు

"ఆ మాట తీరూ, ఆ మన్ననా మీరామెను చూసి తీరాలి, ఈ సారి మీరూ నాతో రండి" అని భార్య అంటుంటే, లోలోపల పిసుక్కు చస్తున్నాడు.

... ఇలా వుండగా, వుండగా ఒకరోజు– ఎటూ కాని టైంలో చీర్ల చంద్రలేఖ ఆయన సెల్‌లోకి వచ్చింది. ఏడుపు గొంతు..మనిషి బాగా టెన్షన్లో వుంది. వున్న పళాన రమ్మని అర్థించింది.

తను వెళ్లేసరికి చిక్కులు పడ్డ దారపు వుండలా చిందరవందరగా మంచం మీద పడివుంది.

తనని చూసి వాటేసుకుని బోరు బోరున ఏడ్చింది. చెంపల్ని తుడుస్తూ, చిక్కుల్ని సరిచేస్తూ చేతికందిన చోట్లా నిమురుతూ, లాలించి, "ఏమిటీ విషయం?" అని బుజ్జగించి అడిగాడు.

గోడు గోడుగా చెప్పింది.

నూకరాజుగాడు తను దాచిపెట్టిన డబ్బూ దస్కం, నగనట్రా తీసుకుని వున్న చీరెలన్నీ మూటగట్టుకొని వుడాయించాడు. పోతూ పోతూ ఇంట్లో పనిపాటకు పెట్టుకున్న పడుచుగుంటను పనిలో పనిగా లేవదీసుకుపోయాడు.

"పోతే పోయాడులే వెధవా!" అంటూ మళ్లీ గాఢంగా హత్తుకున్నాడు.

విసిరికొడుతూ "పోతే పోయాడులే అంటారేంటీ? ఆడు నా పెనిమిటోడండీ బాబూ!"మళ్లీ ఏడుపు మొదలు పెట్టింది.

వాడు పెనిమిటోడయితే మరి తను ఏమిటోడు?

★